ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్

దేశ జీడీపీ ఇంకా పెరిగితేనే కొత్త కొలువులు • ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకో వైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధిరేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

ఇంకో 2 శాతం పెరగాలి

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్-డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి.

వడ్డీరేట్లు తగ్గిస్తే చాలదు

మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే. ఈ నెలారంభంలో కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తెచ్చారు. దీంతో ఆయా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. అయితే ఎకానమీని బలపర్చేందుకు ఈ నిర్ణయం ఒక్కటే చాలదని రాజన్ వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి దోహదం చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగావకాశాలు ఎంతగా పెరిగితే ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు అంత గట్టిగా సాగుతున్నట్టవుతుందన్నారు.

ట్రంప్ టారిఫ్‌లపై..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తు,సేవలపై అధిక సుంకాలను ప్రకటిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ కారణంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు సైతం తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. అయితే ఈ సుంకాలపై రాజన్ స్పందిస్తూ.. అమెరికాతో సత్సంబంధాలు లాభదాయకమని, ఆ దేశం నుంచి చమురు, రక్షణపరమైన కొనుగోళ్లను పెంచడం మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే చాలా వస్తూత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించే వీలుందన్నారు. నిజానికి దీనివల్ల దేశ వృద్ధిరేటు ప్రగతికి వచ్చే నష్టమేమీ లేదన్న ఆయన.. పైగా పరిశ్రమలో పోటీ వాతావరణం నెలకొంటుందని, అది మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇక ఆర్బీఐ గవర్నర్‌గా 2013 నుంచి 2016 వరకు రాజన్ పనిచేశారు.

హైదరాబాద్ బీఈ యూనిట్ విస్తరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 25: ప్రముఖ ఫార్మా సంస్థ బయోలాజికల్ లిమిటెడ్(బీఈ)..తక్కువ, మధ్యస్థాయి ఆదాయం కలిగిన దేశాల్లో చికెన్‌గున్యా వ్యాక్సిన్‌ను అందించడానికి బవేరియన్ నార్డిక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా చికెన్‌గున్యా వ్యాక్సిన్ తయారు చేయడానికి వినియోగించే టెక్నాలజీని ఇరు సంస్థలు పంచుకోనున్నాయి. ఈ వ్యాక్సిన్‌ను తయారు చేయడానికి హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో ఉన్న ప్లాంట్‌ను ఆధునీకరించనున్నట్లు బీఈ లిమిటెడ్ ఎండీ మహిమా దాట్లా తెలిపారు. దీంతో కొత్తగా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఎంతమేర పెట్టుబడులు పెట్టనున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. అంతర్జాతీయ దేశాల్లో చికెన్‌గున్యా వ్యాక్సిన్ అందించాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు బవేరియన్ నార్డిక్ ప్రెసిడెంట్, సీఈవో పాల్ చాప్లిన్ తెలిపారు.

హైదరాబాద్‌లో ప్రోజో రెండు గిడ్డంగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: దక్షిణ భారతంలో వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో ఒకేసారి రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ప్రారంభించింది ప్రోజో. 82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్లతో క్లయింట్లకు వేగవంతమైన సేవలు అందించడానికి వీలు పడనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో సంస్థకు తెలంగాణలో 10 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లువుండగా, అదే దేశవ్యాప్తంగా 40 ఉన్నాయి.

రివోల్ట్ మరో బైకు

- **ధర రూ.1.15 లక్షలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విద్యుత్‌తో నడిచే వాహనాల తయారీ సంస్థ రివోల్ట్ మోటర్స్ ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్వీ బ్లేజెక్స్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.1.15 లక్షలుగా నిర్ణయించింది. 3.24 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 150 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. రూ.500 చెల్లించి బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు వచ్చే నెల నుంచి డెలివరీ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ బైకుపై మూడేండ్లు లేదా 45 వేల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. గంటకు 85 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోవచ్చును. కేవలం 80 నిమిషాల్లోనే 80 శాతం బ్యాటరీ రీచార్జికానున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200 విక్రయ అవుట్‌లెట్లు ఉండగా, ఈ ఏడాది చివరినాటికి వీటిని 500కి పెంచుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రంలో మెగా డ్రై పోర్టు

ప్రత్యేక రైలు, రోడ్డు మార్గాలతో ఏపీ సీ పోర్టుకు అనుసంధానం

సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి.. బయోఏషియా-2025 సదస్సు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. అందుకే ఇక్కడ ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి.. దానికి ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బయో సైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధిపర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. బయోఏషియా-2025 వార్షిక సదస్సును మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయో ఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలో ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా బయోఏషియా సదస్సు నిలుస్తున్నదన్నారు.

ట్రిలియన్ డాలర్లకు..

ప్రపంచంలో పేరొందిన ఫార్మా కంపెనీలు, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్ మరియు బయో టెక్ కంపెనీలెన్నో హైదరాబాద్ నుంచి పని చేస్తున్నాయని, రాబోయే పదేండ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ వేదికపై మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నామన్న ఆయన.. గత 25 సంవత్సరాలలో హైదరాబాద్.. ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా పేరుగాంచిందన్నారు. కాగా, జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో సమావేశం..

ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్ స్టేట్ ప్రతినిధులతో హైచ్ఐసీసీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పరిశ్రమలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ట్రేడింగ్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, ఒప్పందాలపై చర్చించారు. వారు సానుకూలంగా స్పందించారు.

ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు

సెన్సెక్స్ 148 పాయింట్లు వృద్ధి

ముంబై, ఫిబ్రవరి 25: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ మాత్రం వరుసగా ఆరోరోజూ నష్టపోయింది. 5.80 పాయింట్లు కోల్పోయి 22,547.55 వద్దకు జారుకున్నది. ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సూచీ తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా 2.61 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ 2.55 శాతం బలపడింది. దీంతో పాటు జొమాటో, నెస్లే, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు నష్టపోయాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు లేదా 2 శాతం మేర నష్టపోయిన విషయం తెలిసిందే.

ప్రైవేటుకు 13 ఎయిర్‌పోర్టులు?

వచ్చే ఏడాది మార్చికల్లా అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్-మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.

ఇదీ సంగతి..

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలీకట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంఫాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

విమర్శలు వస్తున్నా..

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ర్టాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్-గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

చికెన్, గుడ్లు పంపిణీ చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

బర్డ్‌ఫ్లూ పై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

కరీమాబాద్, ఫిబ్రవరి 25 : సామాజిక మాధ్యమాల్లో బర్డ్‌ఫ్లూపై వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని నెక్ వరంగల్ జోన్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం రంగశాయిపేట జంక్షన్‌లో వెంకట్, నెక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చికెన్ పకోడీ, కోడి గుడ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూతో మనిషి చనిపోయినట్లు మెడికల్ రికార్డుల్లో నమోదు కాలేదన్నారు. పౌల్ట్రీ పరిశ్రమపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడానికే ఈ ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో దివ్య చికెన్ సెంటర్ అధినేత నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

సుబేదారి, ఫిబ్రవరి 25 : మహా శివరాత్రి సందర్భంగా వరంగల్ నగరంలో బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ వేయిస్తంభాల దేవాలయానికి భక్తులు వేలాదిగా తరలి రానున్నందున ములుగు రోడ్డు నుంచి వచ్చే వాహనాలకు అలంకార్ జంక్షన్ వరకే అనుమతి ఉందని పేర్కొన్నారు. ములుగురోడ్డు నుంచి హనుమకొండ చౌరస్తా వైపు వెళ్లే వాహనాలు అలంకార్, కాపువాడ మీదుగా వెళ్లాలని సూచించారు. అలాగే, హనుమకొండ చౌరస్తా నుంచి ములుగురోడ్డు వైపు వెళ్లే వాహనాలు అమృత జంక్షన్ నుంచి యాదవనగర్ మీదుగా వెళ్లాలని తెలిపారు. హనుమకొండ చౌరస్తా నుంచి వేయిస్తంభాల ఆలయం వరకు రోడ్డు కు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయొద్దన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు బుధవారం ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని ఏసీపీ వివరించారు.

పాలకుర్తికి ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రి పురస్కరించుకొని పాలకుర్తి సోమేశ్వరస్వామి దేవాలయానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు వరంగల్-1 డిపో మేనేజర్ మోహన్ రావు తెలిపారు. బుధ, గురువారాల్లో ప్రతి 30 నిమిషాలకు ఒక పల్లె వెలుగు బస్సు హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి పాలకుర్తికి వెళ్తుందన్నారు. భక్తులు వినియోగించుకోవాలని సూచించారు.

నాటకోత్సవాలు, సాహితీ సభలు నిర్వహిస్తాం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 25: ఓరుగల్లు కేంద్రంగా తమ సంస్థ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు, సాహితీ సభలు నిర్వహిస్తామని అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్ చీరాల అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు అధ్యక్షతన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సహృదయ సంస్థ క్రమశిక్షణ, నిబద్ధతతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, మీరా సంగీత మండలి అధ్యక్షుడు పింగిళి వెంకటేశ్వరరావు, ప్రాయోజకులు శశిరేఖ, జ్యోతిలక్ష్మి, డాక్టర్ చక్రధర్ మాట్లాడారు. ప్రదర్శించిన 'సారీ రాంగ్ నంబర్', 'వీడేం మగాడండీ బాబు' నాటికలు అందరినీ ఆలోచింపచేస్తూ నవ్వుల పువ్వులు పండించాయి.

నేడు మహాశివరాత్రి ఆధ్యాత్మిక సమ్మేళనం

- **ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ**
- **హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు**
- **ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో బుధవారం మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఓరుగల్లు గడ్డ మీద పుట్టిన ప్రతి పౌరుడు మన ప్రాంత విశిష్టత, ఔన్నత్యం తెలుసుకోవాలనే ఆలోచనలో భాగంగానే ఏటా ఎంతో వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన, సేవలందించిన వారికి కాకతీయ పురస్కారం ప్రదానం చేసి, సత్కరించనున్నట్లు తెలిపారు. వేడుకలకు మాజీ మంత్రి తన్నీ రు హరీశ్‌రావు హాజరవుతారని, చిలుకూరు బాలాజీ ప్రధా న అర్చకుడు శ్రీరంగరాజన్, ఇస్కాన్ స్వామిజీ శ్రీస్వామి ప్రణవానంద దాస్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుతో ప్రవచనాలు, చిందు యక్షగాన కళాకారులు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, ప్రముఖ గేయ రచయిత, కవి దేశపతి శ్రీనివాస్, అనంత శ్రీరామ్‌తో తెలంగాణ సాంస్కృతిక కళావైభవం సందేశాలు ఉం టాయన్నారు. జాగరణలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమా లు, దేశభక్తి గీతాలు, నృత్యాలు, పేరిణి శివతాండవం, సహస్ర లింగార్చన, సప్తహారతి కార్యక్రమాలుంటాయని, కుటుంబసమేతంగా హాజరై సాంస్కృతిక, కళావైభవాన్ని తిలకించాలని కోరారు.

హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఆధ్యాత్మిక సమ్మేళన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చిత్రంలో రాకేశ్‌రెడ్డి

గ్రౌండ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లా

హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో జరిగే మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం ఏర్పాట్లను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డితోపాటు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, ఎలగందుల రాజు, కార్పొరేటర్ రవినాయక్‌తో కలిసి సభా ప్రాంగణాన్ని సందర్శించారు. ఏర్పాట్ల గురించి రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తుండడంతో ఏర్పాట్లను పరిశీలించారు. ఇండస్ ఫౌండేషన్ శివరాత్రి కార్యక్రమం ఇస్రో స్పేస్ ట్యూటర్ శశాంక్ భూపతి, కో ఆర్డినేటర్లు అభిషేక్, దీపక్, సుకాంత్, కొమురన్న, యాదగిరి, కొడారి రవి, జెట్టి రాజేందర్, ప్రశాంత్, సుమన్ గౌడ్, సతీశ్‌రెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

తండ్రి సంవత్సరీకం మరుసటి రోజే కొడుకు మృతి

రాజశేఖర్ (ఫైల్)

నర్సంపేట, ఫిబ్రవరి 25: తండ్రి సంవత్సరీకం మరుసటి రోజు కొడుకు మృతిచెందిన ఘటన మండలంలోని ముగ్ధుంపురంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకాయల రాజశేఖర్(41)-సౌజన్య దంపతులకు కుమారుడు అభిరాం, కూతురు సిరి ఉన్నారు. ఉండేందుకు ఇల్లు కూడా లేని నిరుపేద కుటుంబం. గ్రామంలోని ముదిరాజ్ సంఘం భవనంలోనే కొన్ని నెలలుగా నివసిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక రాజశేఖర్ ఈనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు ఈ నెల 24న ఉదయం తండ్రి చింతకాయల మల్లయ్య సంవత్సరీకం నిర్వహించాడు. ఆ మరుసటి రోజే కొడుకు రాజశేఖర్ మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ పరామర్శించారు.

నేడు డయల్ యువర్ హనుమకొండ డీఎం

హనుమకొండ చౌరస్తా : హనుమకొండ డిపో పరిధిలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ధరమ్‌సింగ్ తెలిపారు. డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధి ప్రజలు తమ అభిప్రాయాలను 99592 26049 నెంబర్‌కు ఫోన్ చేసి, తెలియజేయాలని ఆయన కోరారు.

తండ్రిని చంపిన తనయుడు

- **నిత్యం తాగొచ్చి వేధిస్తున్నాడని కత్తితో పొడిచి హత్య**
- **ఆవేశంతోనే పొడిచినట్లుగా వెల్లడించిన పోలీసులు**



భాస్కర్ (ఫైల్)

ఐనవోలు, ఫిబ్రవరి 25 : నిత్యం తాగొచ్చి కుటుంబ సభ్యులను వేధిస్తున్న తండ్రిని కన్న కొడుకే హత్య చేసిన ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఐనవోలు మండలం పున్నేల్ గ్రామానికి చెందిన మామునూర్ భాస్కర్(53), భార్య జయమ్మ, పెద్ద కొడుకు అన్వేశ్, చిన్న కొడుకు మామునూర్ అరుణ్(25) అందరూ కలిసి ఉంటున్నారు. తండ్రి, ఇద్దరు కుమారులు ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. పెద్దకుమారుడు అన్వేశ్‌కు పెండ్లి కాగా, అతడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. చిన్న కుమారుడు అరుణ్‌కు పెండ్లి కాలేదు. అందరూ కలిసి ఒకే ఇంట్లోనే ఉంటున్నారు. తండ్రి భాస్కర్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగొచ్చి కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తాగి ఇంటికి వచ్చి భార్య జయమ్మతో గొడవకు దిగాడు. దీంతో అక్కడే ఉన్న చిన్న కుమారుడు అరుణ్ అమ్మను ఎందుకు తిడుతున్నావని తండ్రిని అడ్డుకున్నాడు. అరుణ్‌ను నెట్టేసి దాడి చేసే ప్రయత్నం చేశాడు. ఆవేశంతో అరుణ్ ఇంట్లో ఉన్న బటన్ కత్తితో తండ్రి ఛాతీపై బలంగా పొడవడంతో కింద పడిపోయాడు. గమనించిన భార్య జయమ్మ , పెద్దకుమారుడు అన్వేశ్ భాస్కర్ ఛాతి నుంచి తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో బంధువులతో కలిసి ఆటోలో దవాఖానకు బయలుదేరారు. పున్నేల్ క్రాస్ చేరుకొగానే 108 వాహనం రావడంతో అందులో ఎక్కించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలో భాస్కర్ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అన్న అన్వేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి చెయ్యి విరిగేలా

చితకబాదిన వార్డెన్

- **మూడురోజులైనా తల్లిదండ్రులకు సమాచారమివ్వని వార్డెన్లు**
- **ఇద్దరి తీరుపై మండిపడుతున్న తల్లిదండ్రులు**
- **హనుమకొండ కాకాజీకాలనీ ఎస్సీ హాస్టళ్లలో ఘటన**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించాల్సిన ఓ వార్డెన్ హాస్టల్ విద్యార్థులను చితకబాదాడు. దీంతో ఇద్దరి విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా, మరో విద్యార్థికి ఏకంగా చెయ్యి విరిగింది. ఈ హనుమకొండ జిల్లా కాకాజీకాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. హనుమకొండ కాకాజీకాలనీలో ఒకే కాంపౌండ్‌లో రెండు ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ బాలుర ఆనంద నిలయం ఏ బ్లాక్, ఎస్సీ బాలుర హాస్టల్ బీ బ్లాక్ ఉన్నాయి. ఇందులో అనాథల కోసం ఆనంద నిలయం ఉండగా, ఎస్సీ బాలుర హాస్టల్ ఉన్నది. రెండు హాస్టళ్ల విద్యార్థులకు నాలుగు బాత్‌రూంలు ఉన్నాయి. కాగా, శుక్రవారం సాయంత్రం ఎస్సీ బాలుర ఆనంద నిలయం హాస్టల్‌లో ఉంటూ హనుమకొండ ప్ర భుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మడికొండకు చెందిన రాజారపు సందీప్, నర్సంపేటకు చెందిన ధనుశ్, ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటున్న వరంగల్‌కు చెందిన సాంబశివ అనే ముగ్గురు విద్యార్థులు సిగరెట్ తాగారని ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ సదానందం కర్రతో చితకబాదడంతో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో సందీప్ అనే విద్యార్థికి చెయ్యివిరిగింది. అయితే, అంతకుముందే హాస్టల్‌లో పనిచేసే సిబ్బంది ఎవ రో బాత్‌రూంలో సిగరెట్ తాగి బయటకు రావడం, అప్పుడే ఈ ముగ్గురు విద్యార్థులు బాత్‌రూంలోకి వెళ్లిరావడాన్ని చూసిన వార్డె న్ సదానందం వారే సిగరెట్ తాగారని భావించి ముగ్గురు విద్యార్థులను చితకబాదాడు. చేయని తప్పుకు మమ్ముల్ని కొడుతున్నారని విద్యార్థులు లబోదిబోమంటూ కన్నీరుపెట్టుకున్నా వార్డెన్ సదానందం కనికరం లేకుండా కర్రతో కొట్టాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగి మూడురోజులైనా ఆనంద నిలయం హాస్టల్ వార్డెన్ అర్చన, ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ సదానందం సమాచారం ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పొద్దంటూ విద్యార్థులను బెదిరించారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను దారుణంగా కొట్టిన వార్డెన్ సదానందం, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అర్చనపై వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇరువురిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.



హనుమకొండ కాకాజీకాలనీలో ఎస్సీ బాలుర ఆనందనిలయం

ఇద్దరు వార్డెన్ల మధ్య వార్..

కాకాజీకాలనీలోని రెండు హాస్టళ్ల వార్డెన్ల మధ్య వార్ నడుస్తున్నది. పిల్లలు సిగరెట్ తాగారనే నెపంతో ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ సదానందం కర్రతో చితకబాదడంతో చెయ్యి విరిగింది. మా పిల్లలను మీరెలా కొడతారని హాస్టల్ వార్డెన్ అర్చన సదానందంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుచేస్తే తనకు సమాచారం ఇవ్వాలి కానీ, కొట్టడం కరెక్ట్ కాదని ఇద్దరు గొడవ పడినట్లు సమాచారం. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థులను కర్రతో గట్టి కొట్టడంతో చెయ్యి ఉబ్బడంతో వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఎక్స్‌రే కూడా తీయించినట్లు వార్డెన్ సదానందం తెలిపారు. కాగా, ఇద్దరు వార్డెన్లు మూడురోజులైనా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంతో వారితీరుపై మండిపడుతున్నారు.

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు టికెట్ చార్జీలపై రాయితీ

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : వరంగల్-1 డిపో నుంచి బెంగళూరుకు నడిచే అన్ని ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు టికెట్ చార్జీలపై 10శాతం ప్రత్యేక రాయితీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డిపో మేనేజర్ వంగల మోహన్ రావు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాయితీ వర్తించే బస్సులు, టికెట్ చార్జీలు

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు..

- *లహరి ఏసీ బస్సు స్లీపర్ బర్త్* మునుపటి చార్జీ రూ.1,980, రాయితీ ధర రూ.1,770
- *లహరి ఏసీ బస్సు సీటు ధర* మునుపటి చార్జీ రూ.1,510, రాయితీ ధర రూ.1,380
- *సూపర్ లగ్జరీ బస్సు* మునుపటి చార్జీ రూ.1090, రాయితీ ధర రూ.వెయ్యి

ప్రయాణికులు తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించేందుకు ముందుగా టికెట్లు బుక్ చేసుకోవాలని ఆయన కోరారు.